
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024

నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు - 8లో..

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి - 8లో..

'సహకార' సమరం


సిరిసిల్ల అర్బన్ బ్యాంక్

- సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల షెడ్యూల్ జారీ
- ప్రధాన పార్టీల సమాయత్తం
- అభ్యర్థుల ఎంపికకు కసరత్తు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మద్దతుదారుల మధ్య ప్రధాన పోటీ
- 12 డివిజన్లు, 6,177 మంది ఓటర్లు
- ఎస్సీ, ఎస్టీలకు ఒక స్థానం
- మహిళలకు రెండు రిజర్వ్‌డ్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కోసం ఒకవైపు ఎదురు చూస్తుండగానే సిరిసిల్లలో మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. సహకార రంగంలో ప్రతిష్టాత్మకంగా పేరొందిన సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట రెండు మండలాల్లో బ్యాంకింగ్ రంగంలో సేవలు అందిస్తున్న సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ చైర్మన్ స్థానం దక్కించుకోవడానికి కీలకంగా వ్యవహరించింది. ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండడంతో ఆ పార్టీ అర్బన్ బ్యాంక్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనుంది. మరో వైపు అర్బన్ బ్యాంక్ పాలకవర్గంలో పాగా వేయడానికి బీజేపీ పావులు కదుపుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించింది. మిగతా పార్టీలు అభ్యర్థుల ఎంపికపై సమావేశాలు నిర్వహించనున్నాయి. మరోసారి స్వతంత్రంగా రంగంలోకి దిగడానికి ఆశావహులు సిద్ధమవుతున్నారు. షెడ్యూల్ వెలువడడంతో పోటీకి సిద్ధమైన అభ్యర్థులు సిరిసిల్లలోని పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి.

● 12 డివిజన్లు.. 6177 మంది ఓటర్లు

సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి 12 డివిజన్లుగా విభజించారు. 12 డైరెక్టర్ల స్థానాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఒక స్థానం, మహిళలకు రెండు స్థానాలు రిజర్వ్‌డ్ చేశారు. మిగతా 9 డైరెక్టర్ స్థానాలు జనరల్‌గా ఉన్నాయి. 1, 2, 3, 4, 6, 8, 11, 12 వార్డులు జనరల్, 5వ వార్డు ఎస్సీ, ఎస్టీలకు, 7, 10 మహిళలకు రిజర్వ్‌డ్ చేశారు. అర్బన్ బ్యాంక్‌లో 6900 మంది సభ్యులు ఉండగా ఓటు హక్కు కలిగిన వారు 6177 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 4800 మంది, మహిళలు 1376 మంది ఓటర్లుగా ఉన్నారు.

40 ఏళ్లుగా సేవలు

సహకార రంగంలో సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ప్రత్యేక గుర్తింపును సాధించింది. 1983 నుంచి బ్యాంకింగ్ రంగంలో సేవలు అందిస్తోంది. దాదాపు నలభై సంవత్సరాల క్రితం రూ.4.05 లక్షల వాటాధనంతో ప్రారంభించిన బ్యాంక్ గడిచిన ఆర్థిక సంవత్సరం వరకు రూ.94 కోట్ల డిపాజిట్లతో ముందుకు సాగుతోంది. గృహనిర్మాణాలు, బంగారు నగల తాకట్టు, డిపాజిట్లు, వ్యాపార మిత్ర, బిజినెస్‌లకు సంబంధించి రుణాలు అందిస్తున్నారు. దీంతోపాటు బ్యాంక్ ఖాతాదారులకు ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన సౌకర్యం కల్పిస్తున్నారు. 1983 నుంచి ఇప్పటి వరకు బ్యాంక్ చైర్మన్‌లు, పర్సన్ ఇన్‌చార్జిలుగా గౌడ విఠల్, ఎస్ .గంగాధర్‌రావు, జె.రామమూర్తి, జె.నాగేశ్వర్‌రావు, టి.సుదర్శన్‌రెడ్డి, పి.నర్సింహరెడ్డి, గూడూరి పర్శరాం, వి .గోపాల్‌రావు, కోడం చిన్నవెంకటేశం, సీహెచ్ శ్రీహరి, గూడూరి ప్రవీణ్, గాజుల బాలయ్య, ధార్నం లక్ష్మీనారాయణ, గాజుల నారాయణ, గడ్డం విఠల్ పనిచేశారు. ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి పాలకవర్గం పగ్గాలు చేపట్టడానికి ఆశావహులు సిద్ధమవుతున్నారు.

● జూన్ 6న పోలింగ్.. ఫలితాల వెల్లడి

సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 22న జారీ కానుంది. 27నుంచి 29వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 30న నామినేషన్ల పరిశీలన, 31న ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. జూన్ 6న మధ్యాహ్నం వరకు పోలింగ్, అనంతరం కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

రాజన్న ఆలయంలో సాధారణ భక్తుల రద్దీ


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, మే 18 : దక్షిణకాశీ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం సాధరణ భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని తరించారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తుల్లో శనివారం ఎక్కువ మొత్తంలో అభిషేక పూజలో పాల్గొన్నట్లు ఆలయాధికారులు తెలిపారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు.

పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 18: జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం సేకరణ మరో పది రోజుల్లో పూర్తికానుందని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 259 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని వెల్లడించారు. ఐకేపీ, పీఏసీఎస్ డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని వివరించారు. ఇప్పటి వరకే దాదాపు 31201 మంది రైతుల నుంచి 2 లక్షల 8 వేల 566 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 2లక్షల 2వేల 125 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించామని తెలిపారు. 28,612 మంది రైతుల ఖాతాల్లో రూ.344 కోట్లు జమ చేశామని వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎల్లారెడ్డిపేట, మే 18: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, వెంకటాపూర్ గ్రామాల్లో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు 'సెస్' ఏఈ పృథ్వీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పీఎంఐ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

5లోగా యూనిఫాం అందించాలి

ఎల్లారెడ్డిపేట, మే 18: మహిళా సంఘాల సభ్యులకు సరఫరా చేసిన దుస్తులను జూన్ 5లోగా పాఠశాల విద్యార్థులకు అందించాలని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కుట్టు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూనిఫాం తయారీలో మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు సరిపడా వివిధ కొలతల్లో తయారు చేయాలన్నారు. అవసరమైన కటింగ్ మెషిన్లను సమకూర్చుకోవాలని సూచించారు. సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందించేలా చూడాలని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. డీపీఎం సుధారాణి, ఏపీఎం మల్లేశం తదితరులు ఉన్నారు.

కన్నుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోనరావుపేట, మే 18: కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి వెంగమాంబల కల్యాణం శనివారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వరి కొయ్యలు కాల్చితే తగ్గనున్న భూసారం

కోనరావుపేట, మే 18: పొలాల్లో వరి కొయ్యలను కొంత మంది రైతులు కాల్చి వేస్తున్నారని, దాంతో భూసారం తగ్గిపోతుందని కోనరావుపేట వ్యవసాయ అధికారి వెంకటరామమ్మ అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వరి కొయ్యలను కలయ దున్నినప్పుడే భూసారం పెరిగి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వరి కొయ్యలను కాల్చి వేయడంతో భూసారం తగ్గి దిగుబడి కూడా తగ్గిపోతుందన్నారు. పంటల దిగుబడికి ఉపయోగపడే సూక్ష్మజీవులు, రైతు మిత్ర పురుగులు నశించిపోతాయ న్నారు. వరి కొయ్యలను దున్నినప్పుడే సేంద్రియ ఎరువు తయారవుతుందన్నారు. దీంతో దిగుబడి పెరుగుతుం దన్నారు.

డీజిల్ దుర్వినియోగంపై విచారణ

వేములవాడ టౌన్, మే 18 : వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో గతంలో జరిగిన డీజిల్ దుర్వి నియోగంపై వరంగల్ రీజనల్ డైరెక్టర్ మసూద్ శనివారం పలు రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలో 2022 ఆగస్టులో విధులు నిర్వర్తించిన సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నగేష్ రూ.8 లక్షల 56 వేలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి సస్పెండ్ చేశారు. రాష్ట్ర మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాలతో మసూద్ ప్రస్తుత కమిషనర్ అన్వేష్, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు.

గ్రూప్-1 ప్రిలిమినరీ పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 18: జూన్ 9న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో శనివారం హైదరాబాద్ నుంచి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో పాటు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 పోస్టులకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ విడుదల చేసిందని, జూన్ 9వ తేదీన ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించనున్న నేపథ్యంలో సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లను చేయాలని సూచించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఇందులో 4699 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లును పరిశీలించి పూర్తి చేయించాలన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో గతంలో రెండు సార్లు పొరపాట్లు జరిగాయని, అవి పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రూప్ -1 పరీక్ష సజావుగా నిర్వహించేందుకు కలెక్టర్‌ను చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారిగానూ, అదనపు కలెక్టర్‌ను అదనపు కో- ఆర్డినేటింగ్ అధికా రిగానూ నియమించనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో సంబంధిత అభ్యర్థులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు రెండు గంటల ముందు వచ్చే విధంగా చూసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 10 గంటల తరువాత పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డుతోపాటు గుర్తింపు కార్డులు, బ్లూ, బ్లాక్ పాయింట్ పెన్‌లను తీసుకొని రావాలన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరగాలని పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌కు సూచించారు. ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రశ్న పత్రాల తరలింపు సమయంలో పోలీస్ బందోబస్తు ఉండాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో 4699 మంది అభ్యర్థులు పరీక్షలను రాసేందుకు 15 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలఏర్పాటుతోపాటు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, సూపరింటెండెంట్‌లను ఏర్పాటు చేశామన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య అధికారులు పాల్గొన్నారు.


పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ అధికారులు

కక్షిదారుల పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ప్రేమలత

సిరిసిల్ల క్రైం, మే 18: కక్షిదారుల పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత అన్నారు. శనివారం జూన్ 8న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టు హాలులో పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో ప్రయోజ నాలు ఉంటాయన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సగానికి పైగా కేసులను లక్ష్యంగా తీసుకోవాలని సూచించారు. రాజీయే రాజమార్గమని, రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని అన్నారు. అత్యధికంగా కేసులు పరిష్కరించి జిల్లాను మొదటి స్థానంలో నిలిపే దిశగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కేసుల పరిష్కారం కోసం ఎవరిపై ఒత్తిడి తీసుకురావద్దన్నారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

సిరిసిల్ల కలెక్టరేట్, మే 18: ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి మోహన్ శనివారం ప్రకటించారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటలకు మొదలై మధ్యాహ్నం 12 వరకు, రెండో సంవత్సరం మధ్యాహ్నం 2.30 గంటలకు మొదలై 5.30 గంటల దాకా చేపట్టనున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం పరీక్షలకు 2222 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 1412 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. ఈ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇద్దరు డీఈసీలు, చీఫ్ సూపరింటెండెంట్లు 14 మంది, డిపార్ట్‌మెంటల్ అధికారులు 14 మంది, అదనపు చీఫ్ సూపరింటెండెంట్‌లు నలుగురు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ముగ్గురు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు, ఇద్దరు కస్టోడియన్‌లను నియమించామని తెలిపారు.

రహదారులపై ధాన్యం కుప్పలు

వాహనదారుల తిప్పలు

- పక్షం రోజుల్లో ఆరు ప్రమాదాలు
- ఇద్దరి మృతి, పది మందికి గాయాలు
- పట్టించుకోవాలని వాహనదారుల వేడుకోలు


రహదారి పక్కన ధాన్యం కుప్పలు

ఎల్లారెడ్డిపేట, మే 18: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్ తదితర గ్రామాల్లో రహదారుల వెంట ఉన్న ధాన్యం కుప్పలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రైతులు పండించిన ధాన్యం ఆరబెట్టుకునేందుకు స్థలాలు లేకపోవడంతో రోడ్లకు ఇరువైపుల ధాన్యం పోస్తున్నారు. చీకటి పూట వాహనదారుల పాలిట శాపంగా తయారవుతున్నాయి. రాత్రి వేళ కనిపించకపోవడంతో ద్విచక్రవాహనాలు ధాన్యం కుప్పకు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దారి పొడవునా ధాన్యం రాశులు పేరుకుపోవడంతో ఇరుకైన రోడ్డులో ఎదురెదురుగా వాహనాలు ఢీకొని పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు.


నిర్లక్ష్యం ప్రాణాలు తీస్తోంది

మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. కుప్పలుగా చేసి చుట్టు బండరాళ్లను పెడుతున్నారు. దీంతో రాత్రి పూట కుప్పలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నిండు ప్రాణాలు పోతున్నాయని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్షం రోజుల్లో ఆరు ప్రమాదాలు సంభవించాయి. ఇద్దరు మృతి చెందగా పది మంది గాయాలపాలయ్యారు. ఇటీవల రాజన్నపేట గ్రామ శివారులో ధాన్యం కుప్పను ఢీకొన్న సంఘటనలో అదే గ్రామానికి చెందిన ఏర్పుల రాములు తన బైక్‌పై వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ధాన్యం కుప్పను ఢీకొని మృతి చెందాడు. బండలింగంపల్లి శివారులో రోడ్డుకిరువైపుల ధాన్యం రాసులతో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ముస్తాబాద్‌కు చెందిన బండారి శేఖర్ అక్కడికక్కడే చనిపోయాడు. అదే ప్రమాదంలో గంబీరావుపేట మండలం మల్లారెడ్డిపేట వాసి స్వామి తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరుట్లపేట, రాజన్నపేట, అల్మాస్‌పూర్ గ్రామ శివారుల్లో జరిగిన పలు ప్రమాదాల్లో సుమారు 10మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించి రోడ్డుపై ధాన్యం కుప్పలు లేకుండా ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.


ప్రమాదానికి గురైన బైక్(ఫైల్)

చీకటి పూట భయం

- రాజుకుమార్, ఎల్లారెడ్డిపేట



మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారులపై రైతులు ధాన్యం ఆరబెడుతున్నారు. కుప్పలు పోయడంతో రోడ్లపై ప్రయాణించాలంటేనే భయమవుతోంది. చీకటి పూట ఆ దారుల వెంట వెళ్లలేకపోతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కుప్పలు లేకుండా చూడాలి.

అవగాహన కల్పిస్తాం

- రమాకాంత్, ఎస్సై



మండలంలోని గ్రామాల శివారుల్లో రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై కుప్పలుగా పోస్తున్నారు. రైతులకు అవగాహన కల్పించడంతో పాటు నోటీసులను జారీ చేశాం. తూకం వేయాలని కొనుగోలు నిర్వాహకులకు సూచించాం. ప్రమాదాలకు కారణమైన ధాన్యపు రాశుల రైతులపై కేసులు నమోదు చేశాం. రహదారుల వెంట ధాన్యం కుప్పలు లేకుండా చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూస్తాం.

చెట్టు పైనుంచి పడి జీపీ కార్మికుడికి గాయాలు

కరీంనగర్ రూరల్, మే 18: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో చెట్టు పైనుంచి పడి పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం విద్యుత్ తీగెలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తుండగా పంచాయతీ కార్మికుడు ర్యాకం శంకర్ చెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శంకర్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

30 నుంచి పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాలు

● ఇంకా ఏర్పాటు కాని సమన్వయ సమావేశం

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు జరుగనుండగా అందుకు తగిన ఏర్పాట్లకు ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతుంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టు వస్తుంటారు. దీనికి పదిహేను రోజులకు ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఆలయానికి రంగులు వేసే పనులు మాత్రమే చేపట్టగా సమన్వయ సమావేశానికి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీ, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇది వరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులతో వీసీ సంకశాల మల్లేశ్

వేములవాడ టౌన్, మే 18 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి సంకశాల మల్లేశ్ విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన బంగారు పతకాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నిరంతరం సాధన చేస్తే తప్పక లక్ష్యాలని సాధించవచ్చన్నారు.ప్రతి విద్యార్థి రోజుకు కనీసం ఐద నుండి ఆరు గంటలు సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. నేటి యువత టీవీ, సెల్‌ఫోన్, సినిమా వంటి మాధ్యమాలకి బానిసలు కావడం బాధాకరమని, వాటిని విద్యార్థులు కేవలం తమ విద్య విజ్ఞానం, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పీజీ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పోటీ పరీక్షలలో విజయం సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుని దానికనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించారు. 2020-23 సంవత్సరానికి గాను అకాడమిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పున్నశాస్త్రి, సనా, అరుణ్, మేహ, నందిని, రేవతి, రిషీంద్ర, కేజీయా, రజిత, సౌజన్య, సౌమ్య, భార్గవి, రాజు, రఘు, అజయ్, అనిల్‌లకు బంగారు పతకాలను అందజేశారు. ఈ సమావేశంలో టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కదారి సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ మధురాజేశ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వి. రాధాకృష్ణమాచార్యులు, కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, పరుశు రాములు, జయవర్ధన్ జగన్నాథచార్యులు తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

కోనరావుపేట, మే 18 : కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు గెంటె రాములు (102) శనివారం మృతి చెందాడు. రాములు ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకునేవాడు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. రామయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

నాచుపల్లి జేఎన్‌టీయూకు ఐఎస్‌వో గుర్తింపు

కొడిమ్యాల, మే 18: కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్‌టీయూ యుసీఈజే(అటానమస్)ఇంజనీరింగ్ కళాశాలకు ఐఎస్‌వో (ఇంటర్‌నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్)గుర్తింపు లభించింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ కార్యాలయంలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ హైదరాబాదు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా.. కె. వెంకటేశ్వర్‌రావు సమక్షంలో సర్టిఫికెట్‌ను అందించారు. ఈ నెల 15న హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించి సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 2027 వరకు గుర్తింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగులమందు తాగిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, మే 18 : మద్యం మత్తులో పురుగుల మందు తాగిన మంద నరేష్(38) అనే యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన నరేష్ మద్యానికి బానిసగా మారటంతో అతని భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావటంలేదు. దీంతో మనస్తాపం చెందిన నరేష్ ఈ నెల 4న మద్యంలో పురుగుల మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు డబ్బాతో యువకుడి ఆత్మహత్యాయత్నం



బాధితుడితో మాట్లాడుతున్న పోలీసులు

చందుర్తి, మే 18: ఆరు నెలలుగా పోలీసులు వేధిస్తున్నారంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్ అనే యువకుడు శనివారం పురుగుల మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్‌కు అదే గ్రామానికి చెందిన మల్లేశంకు ఆరు నెలలుగా ఇళ్ల స్థలాల సరిహద్దు వివాదం కొనసాగుతోంది. జలేందర్‌ను పలుమార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిచి కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు వేధిస్తున్నారంటూ ఏప్రిల్ 8న ఎస్పీని కలిశాడు. విచారణ చేపట్టాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లును ఎస్పీ ఆదేశించారు. విచారణ చేపట్టిన సీఐ ఎవరి హద్దుల్లో వారే ఉండాలన్నారు. మల్లేశం వెళ్లి ఫిర్యాదు చేయడంతో పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని, తాను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జలేందర్ వాపోయాడు. శనివారం నిర్మాణం కోసం వివాదంలో ఉన్న స్థలంలో మల్లేశం ఇసుక పోయించాడు. దీంతో జలేందర్ తన తల్లి ఎల్లవ్వతో, చెల్లె పావనితో కలిసి పురుగుల మందు డబ్బాను వెంట తీసుకుని ఠాణాకు వెళ్లాడు. ఆత్మహత్యకు యత్నించగా అనుమానం వచ్చి అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రంగస్వామి అడ్డుకున్నారు. అనంతరం చందుర్తి సీఐ హామీతో బాధితుడి కుటుంబ సభ్యులు వెనుదిరిగారు. ఈ విషయమై చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాను జలేందర్‌ను స్టేషన్‌కు పిలిపించలేదని గంగాధర్ అనే వ్యక్తి ఠాణాకు వచ్చి పురుగుల మందు డబ్బాతో బెదిరించాడని వివరించారు.

'ఎప్‌సెట్'-24లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ఘన విజయం

కరీంనగర్ టౌన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎప్‌సెట్) ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలతో ఘన విజయం సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్త ంచేశారు. శనివారం ఎప్‌సెట్‌లో అద్భుత ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యార్థులు వి.హాసిని 114వ ర్యాంకు, ఎన్.హేమంత్ 157, జి.శ్రీహాస్ 166, కె.సుప్రియ 296, ఎన్.జ్ఞానద 480, వి.శ్రీముఖి 568, ఎం.వర్షిత్ 575, జి.సాయిమంజునాథ్‌రెడ్డి 610, పి.జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీవెన్నెల 876, తేజస్విని 942, ఏ.శివవరుణ్ 973, సిహెచ్.అనూహ్య 950, పి.శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారని అన్నారు. 16 మంది విద్యార్థులు 1,000లోపు ర్యాంకు సాధించడం విశేషమని అన్నారు. 29 మంది విద్యార్థులు 2వేలలోపు, 63 మంది విద్యార్థులు 3వేలలోపు, 116 మంది విద్యార్థులు 5వేలలోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిప్రతిష్ఠలను నిలబెట్టారని అన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యుద్భుత ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు. 450 మంది ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ఎప్‌సెట్-24 ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

'ఎప్‌సెట్'-24 ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థుల జయకేతనం

కరీంనగర్ టౌన్, మే 18: ఎప్‌సెట్-24 ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారు. శనివారం రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక ట్రినిటీ కళాశాలలో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఛైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రినిటీలో విద్యనభ్యసించిన హానికర్ అత్యుత్తమ ర్యాంకు 44 సాధించారని అన్నారు. అలాగే వివిధ విభాగాల్లో పి.ప్రణయ్ 773వ ర్యాంకు, వై.అవ్లేష 1254, వి.శ్రీతేజ 1255, వై.అశ్విత 1551, సిహెచ్.విగ్నేష్ 1624, ఆయేషా మహజబీన్ 1627, ఫిల్జాఅతిక్ 1748, ఎస్.శ్రీలక్ష్మి 2159, ఎం.హర్షవర్ధన్ 2280, ఎన్.గంగశ్రీ 2372, పి.శ్రీదీప 2682, సిహెచ్.రంజిత 2815, మబిహా ఫాతిమా 2913 ర్యాంకులు సాధించారని అన్నారు. అలాగే ఎం.అశీష్ 2954, కె.రాణి 2996, వి.నాగజ్యోతి 3059, ఎ.అర్షిత 3266, పి.స్మరణీ 3502, అంశారా సహర్ 3877, అతిఫా ఫాతిమా 4012, ఎల్.ప్రతిమ 4101, బుస్రా బమాన్ 4255, బి.వైష్ణవి 4302, జి.దివ్య 4422, పి.హంసిని 4609, జె.కీర్తన 5041, ఎన్.దేవిక కృష్ణన్ 5050, బి.శుతి 5060, కె.అర్చన 5225, పి.జ్యోతిప్రకాశ్ 5267, సిహెచ్.సాయి మోహిత్‌రెడ్డి 5343, కె.సాయి ప్రద్యుమ్న ఆచార్య 6288, జె.హేమశ్రీ 6655, ఎల్.గణేశ్ 6729, సిహెచ్.జాన్ 7578, ఆర్.లక్ష్మీప్రసన్న 7675, రతన్‌కుమార్ 7757 పి.దుర్గాభవాని 8016, ఎ.సాహిత్య 8273, కె.శశాంక్ 8329, ఎ.వైష్ణవి 8415, డి.అలేఖ్య 8473, బి.కార్తీక్ 8580, పి.వినయ్ 9342, కె.శరణ్య 9591, ఎన్.స్నేహిత 9757 ర్యాంకులు సాధించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల ఫౌండర్ ఛైర్మన్ మనోహర్‌రెడ్డి

ధాన్యం కొనాలని రాస్తారోకో

బీర్‌పూర్, మే 18: కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా పేరుకు పోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేపట్టారు. బీర్‌పూర్ మండలంలోని కందెనకుంట సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నర్సింహులపల్లి, కందెనకుంటకు చెందిన రైతులు నర్సింహులపల్లి శ్రీకృష్ణ యాదవ సంఘం సమీపంలో ప్రధాన రహదారిపె బైఠాయించి సుమారుగా గంటపాటు రాస్తారోకో చేశారు. రైతుల రాస్తా రోకో కారణంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యంలో కోతలు విధించకుండా చూడాలని, అంతే కాకుండా అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లించి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ జడ్పీటీసీ కొల్మూల రమణ, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి శీలం రమేష్, నాయకులు మెరుగు రాజేశం, శీలం రవిందర్, సుశీన్, తాడుక మల్లేశం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు


దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చందనోత్సవం

- ఆరో రోజూ ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో భక్తుల రాక

ధర్మపురి, మే 18: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసపూర్వక, షోడశ ఉపచార పూజ, సహస్ర నామార్చన నిర్వహించారు. పంచోప నిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. అలాగే లోక కల్యాణార్థం నిత్యం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు. గోదావరిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సమ్మయ్య(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 18: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని శనివారం వెనుక నుంచి ఓ వాహనం అతివేగంగా వచ్చి వేగంగా ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(55) తన పనుల నిమిత్తం సైకిల్‌పై ఇందిరానగర్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్న వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువతిపై కేసు

తిమ్మాపూర్(మానకొండూర్) మే 18: ప్రేమ పేరుతో డబ్బులు దండుకొని ఆస్ట్రేలియాకు వెళ్లిన ఓ యువతిపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,, తిమ్మాపూర్‌కు చెందిన మాదన నాగరాజు అనే యువకుడు యోగా నిమిత్తం ఈశా ఫౌండేషన్‌కు వెళ్లాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన కమల సంధ్య ప్రియాంకతో నాగరాజుకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కొద్ది నెలల క్రితం వీరిద్దరు తిమ్మాపూర్‌కు రాగా నాగరాజు తండ్రి మల్లయ్య ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో అదే గ్రామంలోని ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు.. కాగా నాగరాజు ఓ ఆసుపత్రిలో తన పేరున ఉన్న భాగస్వామ్యంను రద్దు చేసుకోవడంతో రూ. 16లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని ప్రియాంక తన బంధువుల అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నది. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి మూడు లక్షలతో పాటు నాగరాజు వాటా ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తన కుమారుడు తనను భూమి కోసం తండ్రిని వేధిస్తున్నట్లు తెలిపారు. కొంత కాలానికి ప్రియురాలు మోసం చేసిందని తీవ్ర మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగి ఆసుపత్రిలో చికిత్స పొందున్నతున్నాడు. నాగరాజు తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కమల సంధ్య ప్రయాంకపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన తేజస్వినికి అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్‌కు చెందిన యువకుడు తేజ తన తల్లి కరికె వనిత, సోదరి తేజస్వినితో కలిసి బైక్‌పై మండల కేంద్రం మీదుగా వెళ్తున్నాడు. నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇర్ఫాన్ తన జీపుతో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తేజస్వినికి తీవ్ర గాయాలవగా తేజ, వనిత స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తేజస్విని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే 18: మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. శనివారం ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుడు వామన చక్రపాణి ఆధ్వర్యంలో పురోహితులు వేదమంత్రోచ్చారణలతో భాజా భజంత్రీల మధ్య అంగరంగ వైభ వంగా కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు, కృష్ణారావులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, నాయకులు కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, మామాడి నారాయణరెడ్డి, గోరుమం తుల ప్రవీణ్ కుమార్, కల్లెడ గంగాధర్, ఏలేటి వినోద్, చిలువేరి నరేందర్, రాజేందర్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


వేంపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కథలాపూర్, మే 18 : మండలంలోని దుంపెటలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారల కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు కావడంతో పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, మంగళహారతి, మంత్ర పుష్పం, విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు నారంభట్ల వామనశర్మ, హరిప్రసాద్‌శర్మ, గిరధర్ శర్మ, భరద్వాజ్, రాజుశర్మ నేతృత్వంలో కల్యాణం కమనీయంగా జరిగింది. విశ్వక్సేన ఆరాధన, మహా గణపతి పూజ, పుణ్యహవచనం, గౌరీపూజ, అంకురారోపణ, ఎదురుకోలు, గరుడ వాహన పూజ, విశేష హవనాలు వంటి కార్యక్రమాలు జరిపారు. కళ్యాణం వీక్షించేందుకు చుట్టు పక్కన గ్రామాల నుంచి మహిళలు తర లివచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవే క్షించారు. గదుల కొరతతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. రా త్రులు ఆరుబయటనే నిద్రించారు.


కొండగట్టులో భక్తుల సందడి

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ లీగల్, మే 18: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పులు, చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్త అడిషనల్, అ సిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమావేశంలో కూడా వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసుల పూర్తి అవగాహనతో ఉండాలని, సంబంధిత న్యాయమూర్తులతో సమన్వయంతో కలిసి వెళ్లాలని అన్నారు. అనంతరం కరీంనగర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరస్వామి నూతన చట్టాలను వివరించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, నర్సింగారావు, తుమికి పవన్‌కుమార్, జూలురు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్‌రావు, వసంత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మందమర్రిటౌన్, మే 18: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి జీఎం కార్యాలయం వెళ్లే రోడ్డు వద్ద శనివారం రాత్రి వాహనం ఢీకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని వావిలాల గ్రామానికి చెందిన కుంబం రాధమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. రాధమ్మ మందమర్రిలోని కూతురును చూసేందుకు జమ్మికుంట నుంచి మందమర్రికి వచ్చింది. మందమర్రిలో బస్సు దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంట్, టిఫిన్ సెంటర్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు


డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

కరీంనగర్ మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ పట్టణంలో పలు హోటల్స్, టిఫిన్ సెంటర్ల, రెస్టారెంట్‌ల్లో శనివారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్ల, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ (గృహవసరాల) సిలిండర్లను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రభుత్వం గృహలక్ష్మీ పథకంలో భాగంగా 500రూపాయలకే లబ్ధిదారులకు సిలిండ్‌లను అందజేస్తోంది. గృహ అవసరాలకు అందించే సిలిండర్ ధర 1000రూపాయలు ఉండగా అందులో కొన్ని గృహలక్ష్మీ పథకం కింద 500రూపాయలకే అందిస్తోంది. కమర్షియల్ సిలిండర్ 2,300 రూపాయలకు మార్కెట్ ధర ఉంది. అయితే సిలిండ్‌లు కాస్తా పక్కదారి పట్టి హోటళ్ల, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు డొమెస్టిక్ సిలిండర్‌లను ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో గండిపడటమే కాకుండా పేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకం లబ్ధిదారులకు నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై అధికారి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం హోటళ్ల, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్లపై దాడులు నిర్వహించి 96 సిలిండర్‌లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. గృహ అవసరాలకు వాడాల్సిన సిలిండర్లను కమర్షియల్‌కు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న రైతులు


మామిడిపల్లిలో అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, మే 18: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. కొంతమంది ఇసుకను తోడేస్తున్నారని అక్రమంగా తరలించి కూడా అమ్ముకుంటున్నారని అన్నారు. ఇసుక రీచ్‌ను మామిడిపల్లిలో బంద్ చేసి వేరే చోట ఇవ్వాలని అన్నారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఆర్ఐ రాజశేఖర్ చేరుకొని రైతులతో మాట్లాడి లోతుగా తీయకుండా మరోచోట ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఇసుక రీచ్‌ను నడవనిచ్చారు.

చిరుత దాడిలో దూడ మృతి

రుద్రంగి, మే 18: రుద్రంగి మండల కేంద్రంలో చిరుత దాడిలో దూడ మృతి చెందింది. మండల కేంద్రానికి ద్రానికి చెందిన చిట్టపురం గంగాధర్ అనే రైతు నల్లగుట్ట ప్రాంతంలోని గోరిలాల్వ దగ్గర తన పొలం వద్ద రోజు మాదిరిగానే దూడను కట్టేశాడు. ఉదయం పోలం వద్దకు వేళ్లి చూసే సరికి దూడ మృతి చెంది ఉందని, చిరుతపులి ఆనవాళ్లు ఉండడంతో రాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసి దూడను చంపిందని భాదిత రైతు తెలిపాడు. నల్లగుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

అష్ట కష్టాలు

- డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సౌకర్యాలు నిల్
- ఉండలేక తాళాలు వేసిన వెళ్తున్న లబ్ధిదారులు



పోతారం గణేశ్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సారంగాపూర్, మే 18: అక్కడ తాగునీటి సౌకర్యం ఉండదు.. విద్యుత్ సౌకర్యం అసలే లేదు. ఇక డ్రెయినేజీ నిర్మాణం పూర్తి కాక ఇళ్ల మధ్యనే ఆ మురుగు పారుతూ ఉంటుంది. ఆఘమేఘాల మీద ఇళ్లు నిర్మించినా అంతర్గత రహదారులు మాత్రం ఇప్పటికీ దిక్కు లేదు. ఇదంతా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితి. కనీస వసతులు లేకున్నా కొందరు తప్పని పరిస్థితుల్లో ఆ ఇళ్లలోనూ ఉంటున్నా మరి కొందరైతే తాము ఇక్కడ ఉండలేమంటూ ఊరికి దగ్గరగానే అద్దె గదుల్లో ఉంటున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్లే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాన పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో 20 ఇళ్లు నిర్మించారు. వీటిని టాటరీ పద్ధతిలో గత సంవత్సరం లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇళ్లు మాత్రం పంపిణీ చేశారు కానీ వాటిల్లో కనీస సౌకర్యాలు మాత్రం కల్పించలేకపోయారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసౌకర్యాల మధ్యనే లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రధాన రహదారి నుంచి తీగలు లాగి ఇళ్లలో అమర్చుకున్నారు. దీంతో గాలి వానకు తీగలు తెగిపోవడంలో కరెంట్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. తాగునీటి సౌకర్యం లేక సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ బగీరథ నీరు వస్తున్నా అది కూడా మూడు రోజులకు ఒక సారి రావడంతో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మురుగు నీరు కాలువలో నిలిచి పోవిడంతో దోమల బెడద తీవ్రమైంది. దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని లబ్ది దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడిచినా సీసీ రహదారుల నిర్మాణాలు ఇప్పటికీ లేకపోవడం గమనార్హం. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక్కట్లు మరింత పెరుగుతాయిఇ. ఇళ్ల ముందే వర్షపు నీరు నిలవడం, డ్రెయినేజీల్లో నిరు నిండి దుర్గంధం వెదజల్లడం వంటి సమస్యలతో లబ్ధిదారులు ఉండలేకపోతున్నారు. వసతులు లేకపోవడంతో లబ్ది దారులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లి పోతున్నారు. నిలువ నీడ లేని కొంత మంది మాత్రం అక్కడే ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు రూ. 25లక్షలతో విద్యుత్, మంచినీటి సదుపాయం, రహదారుల నిర్మాణంతో పాటు మరిన్ని వసతులు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాక సమస్యలతో సహవాసం చేయల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూర్తి చేయని డ్రెయినేజీ

కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి..



కరెంట్ సౌకర్యం లేక పోవడంలో రోడ్డు నంచి తీగలు లాగి అమర్చుకున్నాం. గాలి వచ్చినప్పుడు కరెంట్ పోతుంది. దీంతో చీకట్లో ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. సౌకర్యాలు కల్పించేలా చూడాలి. - సంద్రుగుల లక్ష్మి

నీరు రావడం లేదు.



నీటి సౌకర్యం లేక చపోవడంలో సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్తున్నాం. మిషన్ బగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. తాగు నీటికి కొరత ఉండటంతో పొదుపుగా వాడుకుంటున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి. - రాజవ్వ

నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు

- ఏడాదిగా కొనసాగుతున్న పనులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు

తంగళ్లపల్లి, మే 18: నిర్మాణంలో జాప్యం.. ప్రభుత్వం మారడంతో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవన పునర్నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా గత ప్రభుత్వం రూ.9 కోట్లు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో ఏడాది క్రితం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పాత గదులను కూల్చివేసి ఏప్రిల్ 2023లో పనులు ప్రారంభించింది. మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు. ఏడాది గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడం, ప్రభుత్వం మారడం వంటి పరిణామాలతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి.

10 గదులు.. 600 మంది విద్యార్థులు

పాఠశాల భవన పునర్నిర్మాణంలో భాగంగా పాత తరగతి గదులను కూల్చి వేశారు. దీంతో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఏర్పడింది. ప్రాథమిక పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులు, ఉన్నత పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. 600 మంది విద్యార్థులను కేవలం 10 గదుల్లో సర్దుబాటు చేసి బోధిస్తున్నారు. పక్కనే ఉన్న ఎమ్మార్సీ బిల్డింగ్‌ను సైతం పాఠశాల నిర్వహణకు వినియోగించుకుంటున్నారు. గదుల కొరతతో ఏడాదిగా విద్యార్థులకు గ్రంథాలయం, సైన్స్‌ల్యాబ్, కంప్యూటర్ విద్య సక్రమంగా అందించలేక పోతున్నారు. గదుల కొరతతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది.


మధ్యలో నిలిచి పోయిన భవన నిర్మాణ పనులు

నిర్మాణ పనుల్లో జాప్యం

ప్రభుత్వం మారడంతో పాఠశాల భవన నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి కేటీఆర్ చొరవతో స్వచ్ఛంద సంస్థ రూ.9 కోట్లు వెచ్చించి భవన నిర్మాణానికి ముందుకు వచ్చింది. ఏప్రిల్ 2023లో పనులు ప్రారంభించింది. మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించి పనులు వేగంగా నిర్వహించింది. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో పనుల్లో వేగం తగ్గింది. గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేసి మొదటి అంతస్తు స్లాబ్ పోయడానికి సెంట్రింగ్ ఏర్పాటు చేసి చాలా రోజుల వరకు వదిలి పెట్టారు. పక్షం రోజుల క్రితం స్లాబ్ పోయకుండానే సెంట్రింగ్ చెక్కను తొలగించి పనులు నిలిపివేశారు. పాఠశాల కమిటీ సెంట్రింగ్ చెక్కను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించగా చేసిన పనులకు డబ్బులు ఇవ్వడం లేదని చెప్పినట్లు సమాచారం. పాత గదులను తొలగించి కొత్త గదులు నిర్మించకుండా వదిలి పెట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో నిలిచి పోయిన పనులను తిరిగి ప్రారంభించాలని, విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

పనుల్లో వేగం పెంచాలి



- చుక్క శేఖర్, స్థానిక నాయకుడు

పాఠశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి. మధ్యలో పనులు నిలిచిపోవడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి. పాఠశాల నిర్మాణంలో స్వచ్ఛంద సంస్థ చేసుకున్న ఒప్పంద గడువుపై అధికారులు దృష్టి సారించాలి. పనులు వేగంగా జరిగేలా చూడాలి.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



- శంకర్ నారయణ, హెచ్ఎం ఉన్నత పాఠశాల, తంగళ్లపల్లి

తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సరికి పనులు పూర్తి చేయాలి.

త్వరగా పూర్తయ్యేలా చూస్తాం



- మంజుల లింగారెడ్డి, జడ్పీటీసీ తంగళ్లపల్లి

పాఠశాల భవన నిర్మాణం త్వరతగతిన పూర్తయ్యేలా చుస్తాం. మధ్యలో పనులు నిలిచిపోయిన విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్తాం. పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం.

వైభవంగా వాసవీ మాత జయంత్యుత్సవాలు


వాసవీ మాత రథోత్సవం

సిరిసిల్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో వాసవీమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం సిరిసిల్లలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి సిరిసిల్లలోని పురవీధుల గుండా వాసవీమాత రథోత్సవం, శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు కోలాటంతో స్వాగతించారు. శోభయామానంగా సాగిన యాత్రంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన ం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: వాసవి మాతా జయంతి సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లిలోని ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక వాసవి మాతా ఆలయాల్లో అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. ఆ సంఘం సభ్యులు చిన్నమల్లేశం, అశోక్, రాజేశం, నాగేందర్, రాజయ్య, అంజయ్య, రాజు, శ్రీనివాస్, మధు, పాల్గొన్నారు.


ముస్తాబాద్‌లో..

దుబాయ్‌లో ఆలయాన్ని సందర్శించిన ఆది శ్రీనివాస్


బాప్స్ ఆలయంలో తెలంగాణవాసులతో విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 18 : దుబాయి పర్యటనలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అక్కడి హిందూ దేవాలయం బాప్స్‌ను సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన సేవకులు ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం వాసవీమాత జయంతి సందర్భంగా వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన వాసవి మాతా పూజ, రుద్రాభిషేకంలో పాల్గొన్నారు.

రాస్తారోకోకు వెళ్తున్న రైతులను అడ్డుకున్న పోలీసులు


రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

చందుర్తి, మే 18: ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ చందుర్తిలో రాస్తారోకోకు బయల్దేరిన రామన్నపేట రైతులను పోలీసులు మార్గమధ్యలో శనివారం అడ్డుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో రైతులతో మాట్లాడించారు. రెండుమూడు రోజుల్లో లారీలు వచ్చే విధంగా ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

యారన్ సబ్సిడీ డబ్బులు తగ్గించవద్దు


వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

తంగళ్లపల్లి, మే 13: టెక్స్‌టైల్ పార్క్‌లో బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీ డబ్బులను తగ్గించవద్దని, గతంలో ఇచ్చిన మాదిరిగానే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని టెక్స్‌టైల్ పార్క్ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం యూనియన్ ఆధ్వర్యంలో పార్క్ డీవో మోహిజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, పార్క్ అధ్యక్షుడు కూచన శంకర్, జెల్ల సదానందం, అక్కల శ్రీనివాస్, మేఘ అంజనేయులు, రాజశేఖర్, చౌటపల్లి శ్రీనివాస్, లహిక్ అహ్మద్, చాంద్ పాషా పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ

ఇల్లంతకుంట (సిరిసిల్ల రూరల్), మే 18 : త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేయనున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఇల్లంతకుంట మండలం పొత్తూర్ గ్రామంలో శనివారం మండల ముఖ్య సమావేశాన్ని భూంపల్లి భూమిరెడ్డి నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ జూన్ చివరిలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో సీపీఐ అభ్యర్థులు బరిలో ఉంటారని తెలిపారు. బీజేపీ వ్యతిరేకంగా కలిసివచ్చే అన్నిరకాల శక్తులతో కలిసి పనిచేయాలన్నారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం అందించే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పిడుగులు పడి చనిపోయిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ రూ.10లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, చనిపోయిన పశువులకు పరిహారం అందించాలని కోరారు. అరుగ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం సీపీఐ మండల కమిటీని తొమ్మిది మందితో ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మండల కార్యదర్శిగా భూంపల్లి భూమిరెడ్డి, మండల సహాయ కార్యదర్శిగా మర్రి ఎల్లవ్వ, మండల కోశాధికారిలను ఎన్నకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న నాయకుడికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మే 18: పక్షవాతంతో బాధ పడుతూ సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గౌస్‌ను ఆ పార్టీ నాయకులు శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సిరిసిల్ల ఆసుపత్రి సూపరింటెండెంట్ సంతోష్‌తో ఫోనులో మాట్లాడారని స్థానిక నాయకులు పేర్కొన్నారు. నాయకులు నర్సయ్య లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ఎల్లారెడ్డిపేట, మే 18: మండలంలోని వినియోగదారులు తమ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించుకునే సదుపాయం ఉందని ఎల్లారెడ్డిపేట 'సెస్' ఏఈ పృథ్వీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమ బిల్లును డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.టీజీసీఈఎస్ఎస్ఎల్‌టీడీ.సీవోఎం వెబ్‌సైట్‌లోకి వెళ్లి బిల్లుపై ఉన్న యూఎస్సీ నంబర్ నమోదు చేయాలని పేర్కొన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

ఇల్లంతకుంట(సిరిసిల్ల రూరల్), మే 18 : కాంగ్రెస్ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకోక తప్పదని ఇ పార్టీ మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీకి నష్టం కల్గించే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో పని చేసిన మండలంలోని కందికట్కూర్‌కు చెందిన న్యాత అశోక్ అనే కార్య కర్తను జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, ఎంపీటీసీ కరివేదా కర్ణుకార్‌రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు ప్రసాద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేశం, పట్టణ అధ్యక్షుడు మామిడి నరేష్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫాం తయారీ ప్రారంభం

ఇల్లంతకుంట (సిరిసిల్ల రూరల్), మే 18 : మహిళా సంఘ సభ్యులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం తయారు చేయించేందుకు శనివారం ఇల్లంతకుంట మండలంలోని గాలిపెల్లి, కందికట్కూర్ గ్రామాల్లో వీవో భవనాల్లో ఏర్పాటు చేసిన తయారీని ప్రారంభించారు. మండలంలోని 2947 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున కుట్టడానికి ప్రణాళిక రూపొందించారు. జూన్ 10వ తేదీలోగా ఒక జత అందించి నెలాఖారులో మరోజతను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏపీఎంలు వాణిశ్రీ, సీసీలు రామచంద్రరెడ్డి, వెంకటేశం, వీవో అధ్యక్షులు ప్రమోద, పద్మ, కావ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

తంగళ్లపల్లి, మే 18: మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ హామీ ఇచ్చారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌లోని భరత్‌నగర్‌కు చెందిన రుద్రరపు చంద్రయ్య పిడుగుపాటుతో మృతి చెందగా కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సహయాన్ని ఆందజేశారు. జిల్లెల్ల గ్రామంలో మృతి చెందిన బచ్చుపెల్లి నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు సత్తు శ్రీనివాస్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారని, ఆదుకుంటామని హామీ ఇచ్చారనిని వెల్లడించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

మెట్‌పల్లి రూరల్, మే, 18 : మండలంలోని ఆత్మనగర్ గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహకులు ఘనంగా జరిపించారు. శనివారం ఆయలంలోని స్వామివారికి పురోహితులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డె నరహరి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామల విశ్వబ్రహ్మణ సంఘంతో పురోహితులు వేదమంత్రత్సోవాల మధ్య స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు గడ్డె నరహరి అన్నదాన కార్యక్ర మాన్ని చేపట్టారు. ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామల విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో ఉన్న విశ్వకర్మ సత్సంగ్ భవన్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవ సమాధి అయి న వైశాఖ శుద్ధ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మంగారి చరిత్ర నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను సన్మానించారు. ఈ కార్య క్రమంలో యోగా గురువు వంగళ భాస్కరా చారి, టీవీ సత్యం ఉన్నారు.

రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వం

మెట్‌పల్లి రూరల్, మే, 18: తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శని వారం మండలంలోని వేంపేటలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన కుప్పలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో తప్ప తాలు పేరుతో రైతులను నిండా ముంచి, రైస్ మిల్లర్లకు లాభం చేసి కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో తప్ప తాలు కటింగ్ లేకుండా కొన్న ధాన్యానికి మూడు రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతోందన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, జెట్టి లక్ష్మణ్, వెల్మ రాజారెడ్డి, ఏనుగు బుచ్చిరెడ్డి, కొట్టాల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడ టౌన్, మే 18 : సీపీఎం పార్టీ వేములవాడలో నిర్వహించబోయే రాజకీయ శిక్షణ తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపు నిచ్చారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేములవాడలో జూన్ 8, 9, 10వ తేదీల్లో నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులకు సీపీఎం పార్టీ నాయకులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు హాజరవుతారని అన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చే వారిలో వంద మంది ముఖ్య నాయకులు ఇందులో తర్ఫీదుపొందుతారని వివరించారు. తదనంతరం రాష్ట్ర పార్టీ నాయకులు శిక్షణ ఇస్తారని అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజా సమస్యలపై సీపీఎం పార్టీ అలపెరగని పోరాటం చేసిందని సూచించారు. జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు, ఎగమాంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, మల్లారపు ప్రశాంత్, శ్రీధర్, గణేష్, అశోక్, వేణు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

తంగళ్లపల్లి, మే 18: మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని సెస్ చైర్మన్ చిక్కాల రామరావు భరోసా ఇచ్చారు. తంగళ్లపల్లి మండలం ఇందిరనగర్‌లోని భరత్‌నగర్‌కు చెందిన రుద్రారపు చంద్రయ్య పిడుగుపాటుతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లెల్ల గ్రామానికి చెందిన బచ్చుపెల్లి నర్సయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్ రావు, మాజీ సర్పంచ్ మాట్ల మధు, నాయకులు ఉన్నారు.

పశుగ్రాసం దహనం

చందుర్తి, మే 18: మండలంలోని నర్సింగాపూర్‌లో శనివారం తెల్లవారు జామున గ్రామానికి చెందిన బైరగోని అంజయ్య, కొలకాని మురళి, జగిత్యాల రాజు రైతుకు చెందిన పశుగ్రాసం గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు పశుగ్రాసానికి నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకొని, ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను ఆర్పివేశారు. ఘటన స్థలాన్ని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వేములవాడ టౌన్, మే 18 : తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి నెల రోజులు కావస్తున్నా ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందన్నారు. అకాల వర్షాలకు వడ్లు తడిసి మొలకెత్తుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వహిస్తోందన్నారు. ఎన్నికల హామీల్లో రైతులకు హామీ ఇచ్చిన విధంగా క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌ను వెంటన్నే ప్రకటించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసే వరకు రైతుల వెన్నంటే ఉంటామని, నిత్యం నిరసన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోల కృష్ణస్వామి, ఎంపీ బండ మల్లేశం యాదవ్, వైస్ఎంపీపీ జక్కుల కవిత తిరుపతి, జిల్లా నాయకుడు గోపు బాలరాజు, పట్టణ అధ్యక్షుడు సంతోష్‌బాబు, రేగుల మల్లికార్జున్ నాయకులు మేర్గు లక్ష్మణ్, నామాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో కన్వీనర్ ఆడెపు రవీందర్ డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పిలుపు మేరకు శనివారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేటలో ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, కిసాన్‌మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, నరేష్, వెంకటేశ్వర్లు, సదానందం, రమేష్‌చారి, సత్యం పాల్గొన్నారు.

వీర్నపల్లి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని తరుగు లేకుండా కొనుగోలు చేయాలని శక్తి కేంద్రం ఇన్‌చార్జి, జిల్లా దిశ కమిటీ సభ్యుడు బట్టు పీర్యా, బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలం లాల్ సింగ్ తండా, రంగంపేట గ్రామాలలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాలోతు లక్పతి నాయక్, బాజిరెడ్డి రాజిరెడ్డి, భూక్య రమేష్ నాయక్, అంజి, బానోతు శ్రీనివాస్, గుగులోతు విజయ్, తదితరులు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

తంగళ్లపల్లి: తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, తాలు తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశి చరణ్, ఇటికల రాజు, ఇటికల మహేందర్, సిలివేరి ప్రశాంత్, కోడం భవిత తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నపు వడ్లకే ఇస్తామనడం సమంజసం కాదని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ వేగం పెంచి రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నేత చెన్నమనేని వికాస్ రావు అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంతోపాటు ధర్మారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి శనివారం మాట్లాడారు. కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు దాన్యము తడిసి ముద్దవుతోందన్నారు. అంతే కాకుండా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే ఇస్తామంటోందని మండిపడ్డారు. తెలంగాణలో ఎక్కువగా దొడ్డు వడ్లనే రైతులు పండిస్తున్నారని, అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా నాయకులు గోపాడి సురేందర్ రావు, జవ్వాజి తిరుపతి గౌడ్, మిర్యాల్‌కార్ బాలాజీ, గొట్టె రామచంద్రం, వెలిశాల రవి పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ నాయకులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేశ్ మాట్లాడుతూ రైతులు కల్లాలలో వడ్లను పోసి నెలలు గడుస్తున్నా, రైతుల కష్టాలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఒకపక్క అకాల వర్షాలు, మరో పక్క తాలు, తప్ప, తేమ పేర కోతలు విధిస్తూ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. బీజేపీ నాయకులు మార్త సత్తయ్య, సిరికొండ శ్రీనివాస్, పొంచెట్టి రాకేష్, పత్తిపాక శ్రీనివాస్, లోకోజు సతీష్, జాల గంగాధర్, తోట శంకర్, హన్మయ్యచారి, మట్కు మల్లేశం, నగరం తిరుపతి, పొంచెట్టి తిరుమల్, పులి వికాస్, పాటి సుధాకర్, బొప్ప వెంకన్న, మల్యాల లక్ష్మినారాయణ, పుల్కం నరేష్, నక్క రమేశ్, నగరం తిరుపతి, మల్లారపు నగేష్, ఐరేని రాజు, మహిళా రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వికాస్ రావు


తంగళ్లపల్లిలో పరిశీలిస్తున్న నాయకులు


సిరిసిల్లలో..